## రూపాయితో నిరుపేద జంట ఆదర్శ వివాహం

సైదాబాద్‌లోని ఆర్య ఈవెంట్స్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం




ఉచిత వివాహంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న రూపాయి ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్ కుమార్, అరుణ దంపతులు

సైదాబాద్, అక్టోబర్ 21: రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద జంట నాగలక్ష్మి, పవన్ కుమార్‌ల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. సైదాబాద్‌లోని ఆర్య ఈవెంట్స్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా సోమవారం జరిగిన వివాహానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రూపాయి ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్ కుమార్, అరుణ దంపతులు నూతన వధూవరులకు అవసరమైన వస్తువులను, సామగ్రిని అందజేసి పెండ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నాగమల్ల అనిల్ కుమార్, అరుణ దంపతులు మాట్లాడుతూ, రూపాయితో లగ్నం, రూపాయే కట్నంతో రూపాయి ఫౌండేషన్‌కు దాతలు ఇచ్చే రూపాయితో, ఇప్పటి వరకు ఐదు జంటలకు వివాహాలను జరిపిస్తున్నామని తెలిపారు. దాతలు ఇచ్చే రూపాయి ఇద్దరిని ఏకం చేసి మూడు ముళ్ల బంధంతో ఏడడుగులు నడిపించి పది కాలాల పాటు పచ్చగా ఉండాలన్నదే తమ సంకల్పంగా నిర్వాహకులు పేర్కొన్నారు. దాచిన రూపాయి నిన్ను ధనవంతుడిని చేస్తుంది. దానం చేస్తే అదే రూపాయి నిన్ను ధర్మాత్ముడిగా మారుస్తుంది అనే నినాదంతో కుల, మతాలకు అతీతంగా అనాథలకు, దివ్యాంగులకు, నిరుపేద జంటలకు ఉచితంగా వివాహాలను జరిపిస్తున్నామని వారు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానందకు కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను పలువురు ప్రజా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, బండారి లక్ష్మారెడ్డి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌కు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై ప్రజాప్రతినిధులతో చర్చించారు.



# వొకేషనల్ కోర్సుల పేర.. అమృత దగా

- పారా మెడికల్ కోర్సులు ఎరగా చూపి లక్షలు గుంజిన సంస్థ
- పంజాగుట్ట పీఎస్‌లో కేసు



పంజాగుట్ట పీఎస్ వద్ద బారులు తీరిన బాధితులు

ఖైరతాబాద్, అక్టోబర్ 21: 'మా కాలేజీలో చేరండి.. మంచి భవిష్యత్తు ఉంటుంది' అంటూ పలువురు విద్యార్థుల వద్ద లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేశారు. కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇచ్చారు. తీరా ఉద్యోగాల కోసం ఆ సర్టిఫికెట్లతో ఆస్పత్రులకు వెళ్లిన విద్యార్థులకు యాజమాన్యం చెప్పిన మాటలతో పిడుగు పడినట్లయ్యింది. ఆ సర్టిఫికెట్లు ఇక్కడ చెల్లవని సెలవివ్వడంతో లబోదిబో అంటూ బాధితులు ఆ ఇనిస్టిట్యూట్ వద్దకు పరుగులు తీశారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి.. యాజమాన్యం బెదిరింపులకు దిగడంతో బాధితులు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై శివశంకర్ కేసు నమోదు చేశారు. కాగా, ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీర్‌పేట్‌లోని ఇమేజ్ హాస్పిటల్ లేన్‌లో అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ పేరుతో ఓ పారామెడికల్ ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పారు. ఈ సంస్థకు ఆకాశ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ప్రసాద్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులను టార్గెట్ చేసి వారిని సంప్రదించి తమ విద్యా సంస్థలో చేరితే ఉన్నత ఉద్యోగాలు, అవకాశాలొస్తాయని నమ్మించారు. వారి మాటలను నమ్మిన సుమారు 500 మంది నగరంతో పాటు పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు వివిధ బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ కోర్సుల్లో చేరారు. థియరీ, ప్రాక్టికల్స్‌తో మూడేండ్ల వ్యవధి గల ఈ కోర్సులను విజయవంతంగా పూర్తి చేశారు. ఒక్కొక్కరి వద్ద రూ.55 వేల నుంచి ఆపై లక్షలాదిగా ఫీజులను గుంజారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు సైతం ఇచ్చారు. ఎంతో ఉత్సాహంగా ఆ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు ఉద్యోగాలకు వెళితే ఇంటర్వ్యూలు చేసే యాజమాన్యం విద్యార్థుల వద్దనున్న సర్టిఫికెట్లు యూపీకి చెందిన శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి చెందినవని, ఇక్కడ చెల్లవని చెప్పడంతో ఖంగుతిని సోమవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎండీ, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఎయిమ్స్ పేరుతో..

భారతదేశంలో ఎయిమ్స్‌కు ఓ ప్రత్యేకత ఉంది. కాని అదే పేరుతో వెలిసిన ఈ విద్యా సంస్థ మాత్రం విద్యార్థులను మోసగించడమే పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అమీర్‌పేట్‌లోని ఇమేజ్ హాస్పిటల్ లేన్‌లో అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ సంస్థలో పారా మెడికల్ పలు కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ కోర్సులు పూర్తిగా సైన్స్‌కు సంబంధించిన సబ్జెక్టులు కాగా, ఆర్ట్స్, కామర్స్, మ్యాథ్స్ విద్యార్థులూ అర్హులని ప్రచారం చేశారు.

## 'బాలసదనం ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

భువనగిరి అర్బన్, అక్టోబర్ 21 : బాలసదనంలో బాలికపై లైంగికదాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సామాజికవేత్తలు కోరారు. ఈ మేరకు సోమవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక, హ్యూమన్ రైట్స్ కమిషన్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేశ్ మాట్లాడుతూ బాలసదనంలోకి సాయంత్రం ఆరు గంటల తర్వాత పురుషులకు ప్రవేశం లేకున్నా, రాత్రి 7గంటలకు అవగాహన సదస్సు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. అదే రోజు రాత్రి బాలికపై లైంగిక దాడి జరిగితే.. ఆ విషయాన్ని బాలసదనం సూపరింటెండెంట్ లలిత దాటవేస్తున్నారని పేర్కొన్నారు. బాలికకు జరిగిన అన్యాయాన్ని దాచిపెట్టి అమ్మాయిని ఉద్దేశపూర్వకంగా వేరే ప్రాంతానికి తరలించారని తెలిపారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయాలని, విషయాన్ని దాచిపెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్, నాయకులు లోకేశ్ ఉన్నారు.

## చోరీకి గురైన బ్యాగు, బంగారు ఆభరణాలు రికవరీ

భువనగిరి అర్బన్, అక్టోబర్ 21 : చోరీకి గురైన బ్యాగు, బంగారు ఆభరణాలు రికవరీ చేసి బాధితురాలికి అందజేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ గంగానగర్‌లో నివాసముండే మధు, ఆయన భార్య జ్యోతి దసరా పండుగకు ఆమె తల్లిగారి గ్రామమైన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం గ్రామానికి వెళ్లారు. ఈ నెల 14న జ్యోతి హైదరాబాద్‌కు బయల్దేరింది. ఈ క్రమంలో తొర్రూర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కి తన బ్యాగును బస్ క్యాబిన్‌లో పెట్టింది. ఆ బ్యాగ్‌లో బంగారు గొలుసు, హారం, చంద్రహారం మొత్తం 7తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు ఆమె తెలిపింది. ఘట్‌కేసర్ సమీపంలో తన బ్యాగ్ కనిపించకపోవడంతో భువనగిరి పట్టణంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టణంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా బస్టాండ్ వద్ద బాధితురాలితోపాటు బస్సులో ఉన్న కొందరు ప్రయాణికులు దిగినట్లు గుర్తించారు. ఓ ప్రయాణికుడు తొందరపడి తన బ్యాగుకు బదులు మరో బ్యాగు తీసుకుని భువనగిరి బస్టాండ్‌లో దిగాడు. ఆ బ్యాగు తనది కాదని బస్టాండ్‌లో వదిలి వెళ్లిపోయాడు. సదరు బ్యాగును మరో మహిళ, ప్రయాణికుడు తన వెంట తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. వారి వివరాలు ఆరా తీయగా.. గుంటూరు జిల్లా వినుకొండ మండలం తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గమనించారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బ్యాగు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని బాధితురాలికి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అప్పగించినట్లు ఎస్‌ఐ సుధీర్‌బాబు తెలిపారు.

## రూ.10 కాయిన్స్ వినియోగంపై ఇండియన్ బ్యాంకు అవగాహన




అవగాహన కార్యక్రమంలో కరపత్రాలను చూపుతున్న బ్యాంకు అధికారులు

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): మార్కెట్‌లో రూ.10 కాయిన్స్ వినియోగంపై ఇండియన్ బ్యాంక్ ప్రజా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. సోమవారం నుంచి నగరంలోని హిమాయత్‌నగర్ శాఖలో బ్యాంకు ఎఫ్‌జీఎం జి.రాజేశ్వర రెడ్డి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ తయారు చేసి వాడుకలోకి తీసుకువచ్చిన పది రూపాయల కాయిన్స్‌పై ఉన్న అపోహలను తొలగిస్తూ, వాటిని తిరిగి యధావిధిగా అన్ని చోట్ల వినియోగించేలా బ్యాంకు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రజలతో పాటు రైతు బజార్, షాపుల యజమానులు, హాకర్స్, వీధి వ్యాపారులను కలిసి కాయిన్స్ తీసుకునేలా చేయాలన్నారు. వ్యాపార లావాదేవీలు ఎక్కువగా జరిగే ప్రదేశాల్లో '10 రూపాయల కాయిన్స్ తీసుకోబడును' అనే ప్రచార చిత్రాలను ఏర్పాటు చేయాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు.

## టీచ్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో దీపావళి

మాదాపూర్‌లోని నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్లో సోమవారం టీచ్ ఫర్ చేంజ్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, ప్రముఖ సినీ నటి లక్ష్మి మంచు ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి మంచు లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టీచ్ ఫర్ చేంజ్ భారతదేశం అంతటా విద్య నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో దీపావళి వేడుకలను సంతోషంగా జరుపుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పండుగ భోజనం, వినోద కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు బాణాసంచా కాల్చుతూ సందడి చేశారు. *- మాదాపూర్, అక్టోబర్ 21;*



## సీడీపీఓ వైఖరిపై అంగన్‌వాడీ టీచర్ల ఆందోళన



దాచారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మోత్కూరు, అక్టోబర్ 21 : ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీ వేధింపుల వల్లే దాచారం అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీరాజ్యం మృతిచెందిందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. సోమవారం దాచారంలో లక్ష్మీరాజ్యం దహన సంస్కారాలకు హాజరైన అనంతరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు దాచారం -1 అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పీడీ, సీడీపీఓలు రెండు నెలల క్రితం విజిట్ చేసి తిట్టారన్నారు. వారి మాటలకు లక్ష్మీరాజ్యం డిప్రెషన్‌లోకి వెళ్లిందన్నారు. మరుసటి రోజు ఆగస్టు 28న మోత్కూరులో మీటింగ్‌కు వచ్చి వెళ్తున్న క్రమంలో బైక్‌పై నుంచి కిందపడి బ్రెయిన్ డెడ్‌కు గురైందని తెలిపారు. రెండు నెలలు దవాఖానలో చికిత్స పొంది మృతి చెందిందన్నారు. లక్ష్మీరాజ్యం మృతికి సీడీపీఓ వేధింపులే కారణమని ఆరోపించారు. ఆమె వైఖరితో 8మంది అంగన్‌వాడీ టీచర్లు మృతిచెందారని తెలిపారు. పలువురు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. వేధింపులకు గురిచేస్తున్న సీడీపీఓపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పంతుల శోభ, మోత్కూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఉపేంద్ర, బయ్యని భారతి, నాయకులు నర్మద, భాగ్యలక్ష్మి, సునీత, పుష్ప, నిర్మల, విజయ, సోమనాగేశ్వరి, టీచర్లు పాల్గొన్నారు.

## సూడోమైక్సోమా పెరిటోని బాధితురాలికి హైపెక్ సర్జరీ

విద్యానగర్‌లోని దుర్గాభాయి దేశ్‌ముఖ్ రెనోవా కేన్సర్ సెంటర్ వైద్యుల ఘనత



నాయిని లలితకు ఆపరేషన్ చేసిన దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ రెనోవా కేన్సర్ సెంటర్ వైద్యులు

అంబర్‌పేట, అక్టోబర్ 21: ఈస్ట్ హైదరాబాద్‌లోనే మొదటిసారిగా 52 ఏండ్ల మహిళకు విద్యానగర్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ రెనోవా కేన్సర్ దవాఖాన వైద్యులు హైపెక్ (హైపర్‌థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కీమో థెరపీ) సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. దీనితో సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు, అందుబాటైన ధరలతోనే పరిష్కారం చూపగలమని వైద్యులు రుజువు చేశారు. ఈ సందర్భంగా సెంటర్ మెడికల్ డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ యు.ఆజాద్ చంద్రశేఖర్ సోమవారం వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ గ్రామానికి చెందిన నాయిని లలిత నాలుగు నెలలుగా కడుపు ఉబ్బరం, ఆయాసం, ఆకలి కాకపోవడం, బరువు తగ్గడంతో బాధపడుతున్నారు. తగిన చికిత్స కోసం వైద్యులను సంప్రదించగా 'సూడోమైక్సోమా పెరిటోని' అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారని, తప్పనిసరిగా శస్త్రచికిత్స అవసరమని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ రెనోవా కేన్సర్ సెంటర్‌ను సంప్రదించగా, ప్రముఖ సర్జికల్ ఆంకాలజీ చికిత్స నిపుణులు, ఎండీ డాక్టర్ ఆజాద్ చంద్రశేఖర్ ఈ కేసును ఒక ఛాలెంజ్‌గా పరిగణించి చికిత్స ప్రారంభించారు. లక్షల్లో ఒకరికి ఈ వ్యాధి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. లలితకు అందించాల్సిన చికిత్సపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తూ సైటోరిడక్షన్ విత్ హైపెక్ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్ర చికిత్స అనంతర సేవలతో లలిత పూర్తి ఆరోగ్యంతో కేవలం వారం రోజుల్లోనే కోలుకుంది. సర్జరీలో డాక్టర్లు డా.సమంత్, డా.రవికుమార్ రెడ్డి, డా.ఉల్లాస్, డా.రాకేశ్ కుమార్‌లు పాల్గొన్నారు. మంచి వైద్యం అందించిన వైద్య బృందానికి లలిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీల పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్



యూసుఫ్‌గూడలోని ఐసీడీఎస్ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లతో ఏఐటీయూసీ ప్రతినిధులు.

జూబ్లీహిల్స్, అక్టోబర్ 21: మినీ అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వర్తిస్తున్న టీచర్లకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. యూసుఫ్‌గూడ మధురానగర్‌లోని ఐసీడీఎస్ కమిషనర్ కార్యాలయం ముందు ఉప కార్యదర్శి ఎం.నర్సింహ, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సోమవారం కలిసి అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పదోన్నతి పొందిన మినీ అంగన్‌వాడీ టీచర్లతో ఆందోళన కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ పాలనలో అధోగతి పాలవుతున్న అంగన్‌వాడీ కేంద్రాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 3500 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ మొదటి సంతకం చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వేతనాల విషయం మరిచారని, ఈ ఏడాది జనవరి నుంచి రూ.7800గా ఉన్న వేతనాన్ని రూ.13,650 లకు పెంచిన ప్రభుత్వం పాత జీతాలే విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో కార్మికులతో పాటు వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనడానికి అంగన్‌వాడీ కేంద్రాలే నిదర్శనమని, పదోన్నతి ఇచ్చి ఐదు నెలలుగా పెంచిన వేతనాలు చెల్లించకపోవడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పప్పు, చింతపండు, నూనె, కోడిగుడ్లు నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతామహాలక్ష్మి, వి.మల్లికార్జున్, పార్వతి, సరోజ, అనిత, శ్రీదేవి, ముత్తమ్మ, రాజేశ్వరి, సరస్వతి, వసంత, కైక, వివిధ జిల్లాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా సైమన్



క్రిస్టియన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా నియామక ఉత్తర్వులు అందుకుంటున్న సైమన్

మోత్కూరు, అక్టోబర్ 21 : తెలంగాణ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా మున్సిపాలిటీకి చెందిన కాపర్తి సైమన్ ఎన్నికయ్యారు. పట్టణంలోని క్రైస్ట్ కల్వరి చర్చిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.బాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీటర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సైమన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో క్రిస్టియన్ రైట్స్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కేలోతు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దయాకర్, తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి ప్రభు కుమార్, పాస్టర్ డేవిడ్, అబ్రహం, భాస్కర్ పాల్గొన్నారు.

## జేఎన్‌ఎఫ్‌ఏయూకు స్థలాన్ని కేటాయించొద్దు

ప్రభుత్వ నిర్ణయంపై అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన



జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న జేఏసీ సభ్యులు. ఉద్యోగులు

బంజారాహిల్స్, అక్టోబర్ 21: జూబ్లీ హిల్స్ రోడ్ నం.46లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్‌ఎఫ్‌ఏయూకు కేటాయించొద్దంటూ, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ వర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామం సమయంలో వీరంతా యూనివర్సిటీ పరిపాలనా భవనం, అంబేద్కర విగ్రహం వద్ద బైఠాయించి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జి.మహేశ్వర్ గౌడ్, డా. వై.వెంకటేశ్వర్లు, రుశేంద్ర మణి, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం నేతలు హబీబుద్దీన్, షబ్బీర్, డా. యాకేశ్, డా. అవినాష్, డా. రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 నాణేల స్వీకరణపై బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రచారం

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): మార్కెట్‌లో పది రూపాయల నాణేలను స్వీకరణపై బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విస్తృత ప్రచారాన్ని నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం చేపట్టామని బ్యాంకు అధికారులు తెలిపారు. రూ.10ల నాణేలు చట్టబద్ధమైనవని, వీటిని మీరు రోజు వారి లావాదేవీలకు ఉపయోగించవచ్చు అంటూ కరపత్రాలను రూపొందించి ప్రజలకు, వ్యాపార సంస్థలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దీనిపై ప్రత్యేకంగా రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని బ్యాంకులకు సూచించడంతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామని బ్యాంకు అధికారులు తెలిపారు.



రూ.10 కాయిన్స్ వినియోగంపై బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూపొందించిన ప్రచార పత్రం

## గ్రేటర్@31.6 డిగ్రీలు

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 31.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.1 డిగ్రీలు, గాలిలో తేమ 61 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా, బంగాళఖాతంలో కొనసాతుగున్న ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

## స్వామి రామానంద తీర్థలో వక్తృత్వ, వ్యాస రచన పోటీలు




పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

బేగంపేట్, అక్టోబర్ 21: సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఖాదీ గ్రామ పరిశ్రమల కమీషన్ ఆధ్వర్యంలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రాంలో భాగంగా ఖాదీ ఉత్పత్తుల మీద వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. బేగంపేట్ బ్రాహ్మణ వాడిలో స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో సోమవారం ఈ పోటీలను నిర్వహించినట్టు ఎమ్మెల్యే సురభి వాణీదేవి తెలిపారు. ఈ పోటీలలో శ్రీ వెంకటేశ్వర కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేవీఐసీ డైరెక్టర్ మనోజ్ లంక, అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ రావు, ఎస్‌ఆర్‌టీఐ డైరెక్టర్ శేఖర్ మారం రాజు, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ సురభి అజిత తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను నియంత్రించండి

- ప్రజావాణిలో ఆర్జీలపై కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, అక్టోబరు 21(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో అక్రమ నిర్మాణాలను నియంత్రించడంపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వారి సమస్యలను అడుగుతూ ఆర్జీలను స్వీకరించారు. సమస్యకు పరిష్కారం చూపుతానని ఫిర్యాదుదారులకు కమిషనర్ హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యకు పరిష్కారం చూపక, సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు సాయం అందించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని, ప్రజావాణి కార్యక్రమానికి హెచ్‌ఓడీలు తప్పనిసరిగా హాజరు కావాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో ఎక్కువగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులొస్తున్నాయని, అక్రమ నిర్మాణాలు పూర్తిగా నియంత్రించేలా తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. సంబంధిత విభాగాల సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని, ఆయా సమస్యలపై అలర్ట్‌గా ఉండాలని అధికారులను ఆదేశించారు.

### 202 ఫిర్యాదుల స్వీకరణ

జీహెచ్‌ఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 202 మంది ఆర్జీదారులు తమ సమస్యలపై ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో 51 ఆర్జీలు రాగా, ఆరు జోన్లకు సంబంధించి 151 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.

## మొరిగాడి వెంకటేశ్‌కు గురు పురస్కారం



గురు పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్

ఆలేరు టౌన్, అక్టోబర్ 21 : మహాశాస్త్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం గురు పురస్కారం ప్రదాన ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలేరు పట్టణానికి చెందిన మొరిగాడి వెంకటేశ్ గురుస్వామికి గురు పురస్కార అవార్డు దక్కింది. అయ్యప్ప స్వామి మాలధారులకు ఈ అవార్డు ఇస్తారు. గురుస్వాములు నాయర్ తంత్రి, రాజు దేశ్‌పాండే, కేశవుల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సూదగాని రాజు, సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు టీచర్ ఎక్సలెన్స్ అవార్డులు

బీబీనగర్/ మోత్కూరు, అక్టోబర్ 21 : మండలంలోని చిన్నరావులపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గడగోజు వెంకటాచారి, మోత్కూరు సెక్రేడ్ హార్ట్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మోత్కూరు యాదయ్య టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం రాత్రి అవార్డును అందజేశారు. వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.